# రామం మాస్టారు

"ప్రతివాడినీ లోపలకు పంపేస్తావ్, ఇదేం ధర్మ సత్రమా, దేవాలయమా?" ప్రిన్సిపాల్ బంట్రోతు మీద భగ్గుమన్నాడు.

అప్పటికే గదిలో ఉన్న ముసలాయన బిక్క మొగం వెయ్యలేదు. అంత దూరంనుంచీ వచ్చి చెప్పవలసినది చెప్పకుండా ఎలా?

"బాబు, బీదవాడిని, నేనూ ముప్పైఏళ్ళు నౌకిరి చేశాను.....బడిపంతుల్ని ఎవరు చూస్తారు బాబూ! నా గోడు కాస్త వినం....."

"మాష్టారూ!"

ఆ మాట వినేసరికి రామం మాష్టారికి ప్రాణం లేచి వచ్చినట్టయింది.

"- నేను దురుసుగా మాట్లాడుతున్నా ననుకోకండి! పెద్దవాళ్లు, మీకు నేను విడమరిచి చెప్పనక్కరలేదు..... మా పరిస్థితి అలా ఉంది. ఏంచేస్తాం?"

"బాబూ! కళ్ళల్లో శక్తి ఉన్నన్నాళ్ళూ పాఠాలే చెప్పాను...నాపిల్లలొకటీ నాదగ్గరచదువుకుంటున్న వాళ్లొకటీ అని నేననుకోలేదు.....వీడే కడసారపువాడు. నూటికి ఎనభై మార్కులొచ్చాయి....ఊరుకాని ఊళ్లో నాకేం విలువ ఉంటుంది?....మీరు కటాక్షిస్తే వీడూ డిగ్రీ పుచ్చుకుంటాడు....దానితో....."

"నావల్లకాదు, కాదు, కాదు. పెద్దవాళ్ళు! నేనూ ఒకరి కింద పనిచేసే మనిషినని ఎందుకు తెలుసుకోరు?...ఒరేయ్......వీరిని........"

రామం మాష్టారు నిముషం కిందట ఎక్కాననుకున్న కొండ పాతాళంలోకికూలిపోయింది.

- ఇదీ ఆయన అనుకోని విషయంకాదు....ఎనభై మార్కు లొచ్చినవాళ్ళు చాలామంది ఉన్నారు. ఎనభై రెండు వరకే సీట్లు వచ్చాయి. అధికారుల ఇబ్బందులు వాళ్ళకున్నాయ్! ఎక్కడ చూసినా గళ్ళు-రూల్స్.....ఈ గళ్ళలో సామాన్యుడు బందీ - స్వేచ్ఛ కొనుక్కోడానికి, గళ్ళను ఎదుర్కోడానికి డబ్బు కావాలి. తన ఊళ్లో తను ఉండి ఉంటే ఇంత ఘోరం జరిగేది కాదు. బాబీగాడు ఈఏడు ఇంట్లోనే .....ఉసూరుమని మెట్టు దిగి రోడ్డుమీద కొచ్చి డౌన్ దిగుతున్నారు.......కొండంత ఆశతో ఎక్కినకొండ తన ప్రయత్నం లేకుండానే కాళ్లు కిందకు దింపేస్తున్నాయి.

- కాంతానికి ఆవేశం ఎక్కువ.....చదువుకోనిది, మూర్ఖురాలు..... అది సాధించి పోస్తోందని తను బయలుదేరితే! తనకు వివేకం అక్కర్లా?

"ఇలా ఇంట్లో కూచోకపోతే ఓమారు అలా వెళ్ళి ఎవరికాళ్ళో, వేళ్ళో పట్టుకోకూడదూ?" ఝంఝూ మారుతంలా వినబడ్డాయి ఆ మాటలు.

భార్య దృష్టిలో చులకన అవుతానన్న భయం ఆయనకులేదు. ప్రయత్నం చేస్తే

వచ్చేదేమో అన్నమేరకు మనసును బాధించకుండా ఉండాలని ఈ చివరి ప్రయత్నం.

కసురుకున్నాక ఏమిటో పాపం! కాంతానికి తనే మిచ్చాడు! పిల్లలు తలోదిక్కూ వెళ్ళిపోయారు..... పాతిక ఒకడు పంపితే, వంద కావాలని ఇంకొకడు రాస్తాడు....ఆడపిల్లే నయం.... దాని గురించి ఆలోచన అవసరం లేదు. వీడిగతి ఇంతే....కుక్క మూతి పిందె ......చెట్టు చెడేముందు పుట్టాడు.......

తలవంచుకొని నడుస్తున్నారు మాష్టారు. ఎవడో ధడేలున ఢీకొన్నాడు. కింద పడబోయి నిలదొక్కుకున్నారు ముసలాయన.

అంతే ఒక్క నిముషంలో నలుగురూ తనచుట్టూ మూగారు.

"-అయ్యా! పంతులుగారూ....వీడు మీపర్సు కొట్టేశాడు....ఇదిగో తీసుకోండి!" ఓ పెద్ద మనిషి పర్సు చేతికందించాడు. నలుగురూ పర్సు కొట్టినవాడిని ఫడఫడా నాలుగు లెంపకాయలు వాయించేశారు.

- కళ్ళజోడు పవరు తగ్గిపోయింది....కేకలు హింస....ముసలాయనకు అదోలా పోయింది.

"పదండి. మిమ్మల్ని బస్‌స్టాప్‌వరకూ...."

"అబ్బాయికి సీటు దొరికితే జీతం కడదామని. ఇంకానయం సీటూ రాక...డబ్బూపోతే, కాంతం......."

"కాంతం.........మాష్టారూ....మీరు రామం మాష్టారు కాదూ? నేను మాస్టారూ శివుణ్ణి...మానాన్న పాలెంలో పౌరోహిత్యం....నేను మీఇంట్లో......మీ అబ్బాయి నాతో...."ఎంతో సంబర పడిపోతూ ఆవ్యక్తి మాస్టార్ని కౌగలించుకున్నాడు.

"శివుడో, పరమేశ్వరుడో! నన్ను రక్షించావ్!"

"మాష్టారూ.,....నేను గుర్తులేనా....ఆటో , ఆటో!" ఆటోలో ఎక్కించాడు ఆ వ్యక్తి.

"ఎవరుబాబూ నువ్వు?"

"మీరు కాంతమ్మగారి పేరు ఉచ్చరించక ఉండక పోతే నేను మిమ్మల్ని పోల్చుకోలేకనే పోదును. పదండి మాష్టారు చెబుతాను....ఎంత మారిపోయారు!"

"కాంతం చెడ్డమనిషికాదు!" మాష్టారు ఎందుకో తృప్తిగా నవ్వుకున్నారు.

రామం మాష్టారి మనసులో కొడుకుకి సీటు రాక పోడానికి పోయినడబ్బు దొరకడానికీ కారణం ఒక్కటే - ప్రాప్తం!

శివుణ్ణి అని చెప్పుకున్న నడివయస్కుడి మనస్సులో మాస్టారు కాంతంగారిని గురించి అన్నమాటలే గింగురుమంటున్నాయి.

"ఆటో.....ఆ మేడ దగ్గర ఆపు!"

మాస్టారికి ఎందుకో భయంవేసింది, ఆటోలో కూచోబెట్టి అతనెవరో వెళ్ళిపోతే? చినవాల్తేరుకు ఆటోలో ఆరురూపాలయవుతుంది...కాంతం ఏంసాధించుకొచ్చారనీ ఆటోలో దయచేశారూ? అంటే?

"క్షమించండి మాస్టారూ! పద.....మాస్టారూ మీ ఇల్లు....."

"చినవాల్తేర్!"

ఆటో గీమంటూ అప్పరా అప్ ఎక్కుతోంది.

- కాంతమ్మగారు చెడ్డమనిషికాదు...కాని మంచి మనిషిని ఎవరూ సాధారణంగా తెలుసుకోలేరు.

ఎదుటి మనిషిలోని గుణాల్ని సావధానంగా పరిశీలించడానికి ఓ జీవనకాలం కావాలేమో!

కాంతమ్మగారు మాస్టారు ధర్మపత్ని. పదవీనిర్వహణ అంతటిలోనూ, అంటే సర్వీసులో ఉన్నంతకాలమూ ఆమెను అర్థంచేసుకోడానికే ప్రయత్నంచేస్తూ ఉండేవారు. పదవీ విరమణ చేశాక-అంటే జీవనకాలం అయ్యాక ఈ నిర్ధారణ కొచ్చారు.

భీమాసంస్థ జీవితకాలాన్ని డెబ్భైగా గణిస్తే రాష్ట్ర ప్రభుత్వం యాభై అయిదుగానే గణించి రామం మాస్టారి జీవనకాలం అయిపోయినట్లు పింఛన్‌కి దరఖాస్తు పెట్టేసుకోమన్నారు.

పధ్నాలుగోఏట కాపురానికొచ్చిన కాంతమ్మగారికీ సగటు స్త్రీలందరికీ ఎలాలేవో అలాగే పతిసేవా నిరతికీ, బాధ్యతకీ కాలప్రమాణమూ, ఫించను నిబంధనలూ ఎక్కడా రాసిలేవు. ఆవిడ ఉద్యోగవిరమణ కాలం నుదిటి రాతగా బ్రహ్మకే విదితం.

పెళ్ళయిన ఐదేళ్ళలో నలుగురి పిల్లల తల్లై బోల్డు చాకిరీలో పడిపోయి అత్తగారి పాలనలో ఆవిడసేవల్లో సదా ఆవిడ మాటల్లో, మునిగి తను వార్ధక్యంలో తేలాక నోరుమీద అదుపు ఆవిడకే తప్పింది.

రామం మాస్టారు ఆవిడను అర్థంచేసుకొన్నారు. ఆవిడ చిరాకుకి కారణం పెరుగుతున్న రక్తపుపోటేనని ఆయనకి తెలుసు.

'కన్నమ్మకి కన్నంతవాపు' అని ఎవరి పిల్లల్ని చూసినా, ఎంత పనులలో కొట్టుమిట్టాడుతున్నా పిల్లలంటే దేవులాడిపోయేది ఆవిడ.

భర్తచేస్తున్నది మేష్టరుగిరీ. వచ్చే జీతంతో గడుపుకోవాలి. వాళ్ళ అవసరాలకి వచ్చేవాళ్లేఅయినా పది మంది వచ్చేపోయేకొంప. దీనికితోడు సావిట్లో ఎప్పుడూ పదిమందిపిల్లలు. ఆయన నోరువిడిచి ఎవరినీ ఏదీ అడగడం తెలిసిన మనిషికాదు.

బయటకు విసుక్కోడానికికూడా వీలులేని స్థితిలో పిల్లలమీద చెయ్యిచేసుకోలేక నోరు పారేసుకొనే కాంతమ్మగారి నోరే బయటకు వినపడేది.

ఇంటికి వచ్చిన వాళ్లెవరూ అతిథి సత్కారాలు పొందకుండా వెళ్ళిపోడానికి వీల్లేదు. అది మాస్టారి సిద్ధాంతం, ఆచారం.

చదువుకుంటున్న పిల్లలిద్దరు ముగ్గురు వారాలకి వచ్చేవారు.

వాళ్లు అడగడమే తడవు. మాస్టారిగుండె కరిగి పోయేది. నోరువిడిచి పట్టెడన్నం పెట్టమని అడిగే విద్యార్థికి మొండిచెయ్యిచూపడం నావల్లకాదు! అదే ఆయన బలం! కాంతమ్మ గారి దృష్టిలో విసుగులూ చిరాకులూ- దౌర్బల్యం.

"కాంతం! ఇలా....మాట!"

ఆ గొంతువింటే తెలిసిపోయేది ఆవిడకి ఆయన భోజనానికి ఎవరినో ఉండమంటున్నారని.

కాసేపట్లో మాస్టారే లోపలికెళతారు.

"ఏమంటారు? నసుగుడెందుకు? చెప్పండి?"

"ష్!"

"ఏమిటా దేవరహస్యం?"

"వాళ్ల సావిట్లో ఉన్నారు....సాటివాళ్లు....చితికి పోయారు. ఈ కుర్రవాడి తండ్రీ, నేనూ కలిసి చదువుకున్నాం..."

"ఏ మంటారూ? ఇంతకీ నాకు పాలుపొంగుతున్నాయ్ అవతల?!"

"లక్ష్మీకటాక్షం!"

"మీరు చెప్పేది?"

"మన బిడ్డలతోపాటు....వాడు....లక్ష్మీవారం కుదరలేదట! ఇక ఎన్నాళ్లుకనక....ఎస్సెల్సీ.... మార్చితో సరి వాడి ముఖంచూడు. బ్రహ్మవర్చస్సు జిగ్గుమంటోంది.....నేను నిన్ను కనుక్కోనిదే ఎలా చెబుతాను....అందుకని....."

"ఓరిబాబు! దీనికా ఇంత ఉపోద్ఘాతం....మీరు మంచయితే నేను చెడ్డవుతానా?"

"అదికాదు కాంతం! దక్షతలేదు. నువ్ పిల్లలతో దేవుకుంటూ....అందుకని నువ్ ఆలోచించి....."

ఈ సందర్భంలో మాస్టారిముందు సూచనమేరకు కుర్రాడు లోపలికొచ్చాడు.

"అవతల పిల్లలు కూచున్నారు!" మాస్టారు బయటికి వెళ్ళిపోయారు.

"కూచోనాయనా, పాలపొయ్యి దిగసనదోసివస్తా"

"ఆ చెప్పు. ఎంతమంది అక్కచెల్లెళ్ళు, అన్న దమ్ములు?"

"ముగ్గురు అక్కలు-ఇద్దరన్నలూ. నేనే కడసారపు వాడిని. సత్రవులో పద్దుచేద్దామని అనుకున్నారు. ఈఊళ్లోపెట్టారు....పద్దుపడలేదు...మీబిడ్డలాటివాడిని, మీమేలు మరువను, లక్ష్మిదేవిలాటివాళ్లు..."

"నీ పేరు?"

"శివుడు, భాస్కరం క్లాసువాడినే."

"ఏరా శివా!" భాస్కరం పలకరింత.

"మీరిద్దరూ ఒకే క్లాసుకదూ బావుంది! రానాయనా ఏదో మాతోపాటు నీ ఒక్కడికీ నేనే గుండిగలు వార్చాలి కనక!"

-ఆటో శబ్దంవిని ఆవిడ అరుగుమీదకు వచ్చింది. భర్త పక్కనున్న సూటుమనిషినిచూసి తడకచాటుకి వెళ్ళపోబోయింది.

"కాంతమ్మగారూ! నేనండి. శివుణ్ణి...మీ ఇంట్లో వారం..."

"ఓయ్ నువ్వా! మా భాస్కరంతో కలిసి చదువుకున్నావ్‌కదూ!"

"లక్ష్మివారం...."

"ఓయ్ దానికేంలే!....జ్ఞాపకం లేదటండీ......మన భాస్కరంతో ఎస్సెల్సీ చదివాడు...మీ

స్నేహితుడు పాలెంలో పౌరోహిత్యం....వాళ్ళ అబ్బాయి...."

"శివరావా?"

"అమ్మయ్య! ఆయన అంతేలేనాయనా? ఇప్పుడిలా అయిపోయారు. రా నాయనా, లోపలికిరా. కూర్చో....."

ఒక్క క్షణంలో లోపలనుంచి మజ్జిగ తీసుకొచ్చి శివుడికిచ్చింది ఆవిడ.

"మీరు నిలబడే ఉన్నారు. కూచోండమ్మా! భాస్కరం, విఠల్, ప్రసూన, బుచ్చిబాబు ఎవరెవరు ఎక్కడెక్కడ ఉన్నారు?"

"ప్రసూన అత్తవారి ఇంటికి వెళ్ళిపోయింది. భాస్కరం కాన్పూరులో ఉన్నాడు. వాడికిద్దరు పిల్లలు. విఠల్‌కి బెజవాడలో చిన్న ఉద్యోగం. అయితే వాడి భార్యకూడా టీచరుగా పనిచేస్తోంది. బుచ్చిగాడు బెంగుళూరులో....ఏమిటో పెద్దవాళ్ళమైపోయాం. ఏదో ఇలా....."

"విజయనగరంలో ఇల్లు.....?"

"మరెక్కడి ఇల్లునాయనా. అమ్మాయి పెళ్లికీ భాస్కరం చదువుకీ అయిపోయింది. రిటైరయి మరో ఆసరాలేక ఓ ట్యుటోరియల్ కాలేజీలో చిన్న ఉద్యోగం మీద ఇక్కడకువచ్చిచేరాం....ఇదిగో ఈ చంటాడు."

"మరో అబ్బాయి ఉన్నాడా?"

"వాడికేనాయనా సీటుకోసం వెళ్ళారు. ఎండ. బయట నుంచునే చూస్తున్నా ఆయనకోసం. మాగోడుమాటకేం నీకెంతమంది పిల్లలు? ఏం చేస్తున్నావ్?"

"మీ దయవల్ల యస్సెల్సీ కాగానే దూరపు బంధువొకాయన నన్ను ఆదుకున్నాడు. డాక్టరీ చదివించాడు. నాకు పిల్లనిచ్చి, ఆస్తినీ ఇచ్చాడు. నాకు ఇప్పుడు ఓ రెండువేలిస్తున్నారు. పరువుగా బ్రతుకుతున్నాను. మాస్టారు ఏదో సీటు అంటుంటే ఎవరికో అనుకున్నాను మీ అబ్బాయికేనా?"

"ఎలాబాబూ? ఆయన కసిరికొట్టాడు పొమ్మని. ఇక్కడ నేనెవర్ని ఏమని అడగగలను! ఇంకానయం డబ్బుపోయింది కాదు."

మాస్టారు పెరట్లోకివెళ్ళి చన్నీళ్ళతో ముఖం కడుక్కొని ధోవతి కట్టుకుని వచ్చారు.

"శివుడు డాక్టరయ్యాట్టండీ! చూశారా, మీ ఆశీర్వచనం!"

"అలాగా! దైవకృప!" మాస్టారిముఖం ఆలోచనలో నిండిపోయింది.

"మీరేం దిగులుపడకండి మాస్టారూ. అబ్బాయికి సీటుకేం లోటువుండదు, మీ అబ్బాయి మామూలు మార్కులతో పాసవడు. చాలా మంచిమార్కులు వచ్చే ఉంటాయ్. ప్రిన్సిపాల్ నాకు తెలుసు. అతనికొడుకు నాకు స్టూడెంటు. మాస్టారూ మీరు కొన్ని వేలమంది ఆశలకి ఊపిరిపోసిన మహాత్ములు. సీటు పూచీ నాది అబ్బాయ్ ఏడీ?"

"ఒరేయ్ విస్సూ!"

అబ్బాయి లోపలనుంచి అంతా వింటున్నాడేమో, చొక్కా తొడుక్కొని బయటికి వచ్చాడు.

"బాబూ, నీ సర్టిఫికేట్లు పట్టుకుని నాతోరా!" శివరావ్ ఎంతో ఆదరంగా పిలిచాడు. "నేను మరో రోజువచ్చి మిమ్మల్ని మా ఇంటికి ఓ... వెళతా! మరి సెలవిప్పిస్తారా?"

లేచి నుంచున్న శివుణ్ణి నమ్మలేనట్టు చూస్తూ నుంచుండిపోయింది కాంతమ్మగారు.

ఇద్దరూ వీధిమలుపు తిరుగుతూవుంటే మాస్టారుకి జ్ఞాపకం వచ్చింది.

" అబ్బయ్! డబ్బు , డబ్బు తీసుకెళ్లుతున్నావా?" అబ్బాయి వెనక్కు వెళ్ళబోతుంటే శివరావ్ వద్దని వారించి అతనితో తీసుకెళ్ళాడు అక్కడనుంచే ఏదో సైగచేస్తూ.

'నిక్షిప్తం అంటే ఇదే కాబోలు' రామం మాస్టారు ట్రాన్సుడి అలా చూస్తూ ఉంటే కాంతమ్మగారు ఇంత మొహం చేసుకొని సంతోషంగా అన్నారు.

31.5.1981